
# వాచీ తెచ్చిన పేచీ

రచన : కె. వి. రమణ




రమణ ప్రక్కమీద అటునుంచి ఇటుదొర్లాడు. ఏవో మాటలు వినిపించాయి అతడికి.

"ఏమండీ! ఇంకా లేవరూ!" అంటూ మేల్కొల్పడానికి ప్రయత్నించింది భార్య రాజేశ్వరి.

మెల్లగా లేచి ప్రక్కమీద కూర్చున్నాడు. ఒళ్ళు విరుచుకున్నాడు. అసలే జిడ్డుమనిషి అతడు. కళ్ళు నులుముకున్నాడు. ఎదురుగా చూశాడు.

ఇంకేమిటుంది? అతడు తెల్లవారుఝామున లేచీ లేవగానే చూడరాని వస్తువును చూశేసాడు.

ఎదురుగా అతడి శ్రీమతి చీపురుకట్ట పట్టుకుని నిలబడింది.

అతడికి కోపం మిక్కుటంగా వచ్చేసింది.

"రాజూ ఏమిటిది ? తెల్లవారుఝామునే చీపురుకట్టపట్టుకుని నాకు దర్శనమిచ్చావు?" అని అతడు అన్నాడు కోపాన్నిదిగమింగుకుని.

"ఇంకా తెల్లవారుఝాము ఏమిటండీ? ఎనిమిదైపోతేను!" శ్రీమతి సమాధానం.

"ఆ! ఎనిమిదైపోయిందా? అయితే యిప్పుడా నన్ను లేపటం? నీకు కొంచెమైన తెలివుండి యేడ్చిందా అని! ఎన్నిసార్లుచెప్పాలి తెల్లవారే చీపురుకట్టతో నీ ముఖం చూశాను ఏమవుతుందో యీరోజు!"

"నాముఖం చూస్తేనే మీకు 'యిది'గా వుంటుంది లెండి. ఏదో మీరు సుఖనిద్రలో వున్నారుకదా అని లేపలేదు. మేల్కొల్పటానికి వస్తే తిరిగి చీవాట్లు, చీపురుకట్ట కావాలని తీసుకవచ్చానా యేమిటి? అయినా నాకెందుకు లెండి! ఆడదాన్ని యిలాంటి చీవాట్లు సహించకపోతే ఎలా?"

శ్రీమతి రాజేశ్వరి చరచరా వంటగదివైపు వెళ్లిపోయింది.

రమణ కళ్లుమిటకరిస్తు అటుకేసి చూస్తు వుండిపోయాడు.

ఆడవాళ్లకి ముక్కుమీదే వుంటుంది కోపం.

తను ఏమన్నాడని? తెల్లవారుజామునే చీపురు తనకెందుకు చూపించడం? అలా చూపించడం అపశకునం కాదూ? ఆమాత్రం బుద్ధి స్త్రీకి వుండకపోతే ఎలా ?

రమణ అనుకున్నాడు మనస్సులో తనకేదో ఆరోజు కీడుందని.

లేచి కాలకృత్యాలు తీర్చుకుని గదిలో కూర్చున్నాడు. శ్రీమతి కాఫీ టిఫినుతో అతడి గదిలోనికి ప్రవేశించింది, వాటిని బల్లమీద పెట్టి వెళ్లిపోయింది.

రమణజడ పట్టుకుని వెనక్కిలాగాడు.

"వదలండి" అంది కోపంగా ఈశ్వరి.

"ఏం కోపం వచ్చిందా?"

"నాకెందుకు కోపం?"

"ఏదీ, ముఖం యిటు తిప్పు"

రాజేశ్వరి అతడివైపు ముఖం తిప్పలేదు. అతడు ఆమెను తనవైపు తిప్పుకున్నాడు. నిజంగా ముఖం మలినంగానే వుంది.

రమణ అన్నాడు "రాజూ! నిజంగా నీవు కోపగిస్తే నా హృదయం ఎలా వుంటుందో తెలుసా? మొదట ఏదో అనేస్తాను. తరువాత నేనెంతగా బాధపడతా ననుకున్నావు?"

"మరి మీలాగే నాకుమాత్రం బాధ కలుగదా ఏమిటి?"

అతడి హృదయం శాంతించింది. ఆమెను దగ్గరగా తీసుకున్నాడు.

"చూడు రాజూ! నీగురించి బాధతో యిప్పుడిప్పుడే విరహగీతం వ్రాశాను. వినిపిస్తాను.... విను" అన్నాడు రమణ.

"కడుపునిండా తిని ఆకలిగురించీను, నాతో ప్రేమసల్లాపాలాడుతూ విరహగీతమును వ్రాస్తారు మీరు" అన్నది రాజేశ్వరి.

"నేను ఏది రాసినా నీకు వేళాకోళంగానే వుంటుంది. ఏదో భర్త రాశాడు, విందామన్న ఉద్దేశం లేదాయె!"

"ఆగండి! తర్వాత వినిపిద్దురుగాని, వంటయిల్లు పిలుస్తుంది" అక్కడినుండి రాజేశ్వరి వెళ్లిపోయింది.

* * *

భోజనం ముగించుకుని ఆఫీసుకు వెళ్లబోతూ రమణ తనభార్యను పిలిచాడు.

రాజేశ్వరి అతడి గదిలోనికి వచ్చింది—

"ఏమండీ!"

"నాచేతిగడియారం చూశావా?"

"లేదండీ".

"మరేమైనట్టూ?"

"రాత్రి ఎక్కడ పెట్టారూ?"

"డ్రాయరులో వుంచాను. ఇప్పుడు చూస్తే లేదు"

"మరెక్కడికి పోయింది? పోనీ దొంగ లెవరైనా వచ్చి ఎత్తుక వెళ్ళిపోయా రనుకుందామంటే గడియారాన్ని పట్టుకపోయి మిగతా వస్తువుల్ని వుంచేస్తారా ఏమిటి?"

"అయితే గడియారం ఏమైనట్టూ?"

ఇద్దరూ అవి యివీ కెలికి వెతకటం మొదలుపెట్టారు.

"అసలు నేను మొదట చెప్పనే చెప్పాను. మన పెళ్లిలో మా నాన్నగారిచ్చిన కానుకను భద్రంగా వుంచమని" అంది శ్రీమతి రాజేశ్వరి గడియారం వెదుకుతూ.

"నేనుమాత్రం అజాగ్రతగా పారేశానేమిటి? రాత్రి డ్రాయరులోపెట్టాను. ఏమైందో! మనింట్లోకి ఎవరైనా వచ్చారా అంటే అదీ లేదు...."

రమణ డ్రాయరంతా కంగారుగా వెతికేస్తున్నాడు.

తక్కువధర వాచీ అయినట్లయితే విచారించవలసిన అవసరంలేదు. రెండు వందల రూపాయలు విలువగలది. పైగా మామగారు బహుమతిగా యిచ్చిందీను.

ఎప్పుడైనా మామగారి యింటికి వెళ్లినట్లయితే 'ఏమయా అల్లుడా! వాచీ యేది?' అని అడిగితే ఏమనిచెప్పడం? పోయిందని చెప్పితే అంత మందమతికూడదని అంటారు. తాకట్టు పెట్టానని చెప్పితే మా అమ్మాయిని సరిగా చూస్తున్నావో లేదో ? డబ్బుకికూడ యిబ్బందిగా ఉన్నట్టుంది అంటారు. ఆయనదగ్గర రమణ అంత అవమానం పొందడమే!

"రాజూ!" వెతుకుతూ, వెతుకుతూ రాజేశ్వరిని పిలిచాడు.

"ఏం?" అని తలెత్తి భర్తవైపు చూసింది.

"నిన్న వెంకటేశం ఏదో పార్టీకి వెళతాడని, నా వాచీ యిమ్మని ప్రక్కింటి అమ్మాయి ఉష వచ్చింది. బహుశా ఆ అమ్మాయికి యిచ్చి వుంటానేమో!"

"ఇచ్చారో లేదో ఆమాత్రం జ్ఞాపకంలేదూ? మరయితే రాత్రి డ్రాయరులో పెట్టామన్నారు వాచీని!"

'అవును పెట్టినట్టు జ్ఞాపకం. పోనీ ఎందుకైనా మంచిది, ఆ అమ్మాయిని పిలు అడుగుదాం.'

కొద్దిక్షణాల విరామం తరువాత ప్రక్కింటి అమ్మాయి ఉషతో రాజేశ్వరి అక్కడికి వచ్చింది.

'ఏమండీ పిలిచారట!' అంది ప్రక్కింటి అమ్మాయి ఉష.

'అబ్బే ఏమీ లేదు. నిన్న మీ అన్నయ్య వెంకటేశానికి కాలేజీలో ఏదో పార్టీ వుందని గడియారం అడిగావుకదా? నా వాచీ కనిపించటంలేదు. బహుశా నీవు తీసుకవెళ్ళావేమోనని....'

'మీరిస్తేగదా నేను తీసుకవెళ్లడానికి!'

ఆ అమ్మాయి అక్కడినుండి వెళ్లిపోయింది.

'అనవసరంగా వాళ్ల నడిగాం గడియారం యివ్వకుండానే, వాళ్లు ఏమనుకుంటారో' అంది శ్రీమతి.

'అనుమానం వచ్చినప్పుడు దాన్ని తీర్చుకోవటం మంచిది....నీవు తీసి ఎక్కడైనా పెట్టావేమో వెతుకు ఆఫీసుకు వెళతాను.'

'అబ్బే నేను తీయలేదండి!'

'పోనీ వెదుకు....వెతకటంలో తప్పులేదు కదా?'

రమణ ఆఫీసుకు బయలుదేరబోతున్నాడు. ప్రక్కింటి ఆవిడ రత్నం అక్కడికి వచ్చింది. ఆమె కాలికింద పుంజుడుచీమలు (నల్లవి) చచ్చిపొయ్యాయ్.

ఆవిడ అంది — 'ఏమండీ రమణగారూ! ఏదో మా వెంకటేశం మోజుపడి, ఎప్పుడూ అడగనివాడు మీ గడియారం అడిగితే యివ్వకుండా, వాడిమీద దొంగతనం అంటగడతారా? ఇదేమైనా బాగుందండీ? ఏదో కాలేజీలో పార్టీవుంది గనుక వాడు అడగవలసి వచ్చింది—మీరిస్తారనే వుద్దేశంతో. లేకపోతే మీ వాచీకంటే మంచివి వాడిస్నేహితులదగ్గర లేవనుకుంటున్నారా? మీ వెధవ ముష్టివాచీ అడుగవలసిన కర్మ వాడికేం పట్టింది?'

అవ్వ! ఏం మాట అంది? వెధవ ముష్టివాచీయా అది? రెండు వందల రూపాయల విలువగల వాచీ, పైగా మామగారు పెళ్లిలో బహుమతిగా యిచ్చిందీను. అటువంటిది వెధవ ముష్టివాచీయా?....అయినా సమయం అలాంటిది కాబట్టి, నోరుమూసుకుని రమణ వెళ్ళిపోయాడు తల వొంచుకుని ఆఫీసుకు.

వెంకటేశంతల్లి రత్నం రైలుయింజనులా అక్కడినుండి వెళ్లిపోయింది నాలుగు జాడించేసిన తర్వాత.

అతడి శ్రీమతి రాజేశ్వరి తెల్లబోయి చూస్తు వుండిపోయింది.

* * *

మరి గడియారం ఎవరికిచ్చినట్టు? ఎక్కడైనా పోయిందా? ఎవడైనా చెక్కేశాడా?

రమణ ఆలోచించుకుంటూ ఆఫీసువైపు నడుస్తున్నాడు.

అకస్మాత్తుగా అతగాడికి ఆలోచన వచ్చేసింది.

నిన్న ఆఫీసరు ఫైల్సుచూస్తువుండేటప్పుడు అడిగారు అతడ్ని—'ఏమయ్యా, వాచీ నెంతకి కొన్నావు?' అని.

తను ఏదో సమాధానం అప్పుడు చెప్పాడు.

బహుశా తాను ఆ వాచీని ఆఫీసరుగారిని సంతోషపెట్టడానికి బహుమతిగా యిచ్చున్నాడా? ఏమో! మతిమరుపుమనిషి. ఇస్తే యిచ్చివుండవచ్చు.

అలా ఆలోచించుకుని రమణ ఆఫీసుకు వెళ్ళి తన కుర్చీలో కూర్చొని ఫైల్సుతెరిచాడు. ఎదురుగా గోడగడియారం పన్నెండుకొట్టింది.

అదిరిపడి అటుచూశాడు. కొంపదీసి ఆ గోడగడియారం తప్పుగా నడుస్తుందేమిటి? ఎప్పుడూ కూడ తను ఇంత ఆలస్యంగా ఆఫీసుకు రాలేదే! ఎందుకైనా మంచిదని సందేహనివృత్తికోసం ప్రక్కనున్న క్లర్క్‌ని అడిగాడు 'టైము ఎంతయింది?' అని

అతడు చిఱునవ్వు నవ్వుతూ 'పన్నెండు అన్నాడు.' అలా అని వూరుకుంటే బాగానే వుండేది. 'చెముడా?' అని కూడ అన్నాడు. 'ఏమిటీ?' అని దీర్ఘంతీసి, తనకు చెముడా? అని అనుకున్నాడు. వాడికెన్ని గుండెలున్నాయి తనకి చెముడా అని అనడానికి? సరే! అతడి విషయం తర్వాత చూడాలి.

ఇంతలో ఆఫీసు ప్యూను వచ్చి రమణతో అన్నాడు—'బాబుగారు పిలుస్తున్నారు!'

'ఎందుకు?' అన్నాడు రమణ తలెత్తి.

'అదంతా మీతో చెప్పుకోవా లేమిటి? వెళ్ళి బాబుగార్ని అడగండి' అని వెళ్ళిపోయాడు ప్యూను.

అబ్బ! ఈ ప్యూను కెంత తలబిరుసు. వీడి పిలక గాలిలో ఎగురుతూంది. ఈ సన్యాసి పని తరువాత చూద్దాం.

అసలు ఆ ప్యూను అలా తలబిరుసుగా మాట్లాడటానికి కారణం లేకపోలేదు. రమణ జీతం అందినతరువాత ప్యూనుకి యివ్వవలసిన మామూలు యివ్వకపోవటమే.

ఆఫీసరుగారి గదిలోనికి వెళ్ళాడు. 'ఏం వోయ్ రమణా! ఇంత ఆలస్యంగా వచ్చావేం! ఎప్పుడూ లేనిది? సరేలే! ఈ కాగితాల్ని వేగముగా టైపుచేసి యివ్వు.'

రమణకి తనవాచీవిషయం జ్ఞప్తికివచ్చింది. ఆఫీసరు చేతికేసిచూశాడు. తనవాచీ ఆయన చేతికిలేదు. మరేమైనట్టు? బహుశా ఆయన యింట్లోపెట్టేసి వుండొచ్చు — తను బహుమతిగా యిచ్చిన వాచీ.

'ఏమిటయ్యా ఆలోచిస్తున్నావ్? ఈమధ్య నీకు పరధ్యానం కూడ ఎక్కువైనట్టుంది!' అన్న ఆఫీసరుమాటలతో రమణ యీలోకంలో వచ్చిపడ్డాడు.

రమణ మెల్లగా నసుగుతూ అన్నాడు—'నిన్న మీరు నా వాచీవిషయమై అడిగారు కదండీ....'

'అవును! అడిగాను. ఏమైందిప్పుడు?'

'నిన్న మీకు యిచ్చానేమోనని....'

'ఏమిటీ! ఏమయ్యా! నీకేమైనా బుర్రవుండి ఏడిసిందా? ఏదో సరదాగా ధర యెంత? వాచీ బాగుంది అని అడిగితే, అది నాకు యిచ్చానని యేడుస్తావేమయ్యా? బాగానే వుంది. ఇంట్లో పెళ్ళాంతో దెబ్బలాడిగాని వచ్చావా ఏమిటి? ఇవ్వాళ ఆలస్యంగా వచ్చావు కూడాను' అని ఆఫీసరు గర్జించారు.

ఆ దెబ్బతో రమణ అదిరిపోయాడు. వాచీ గురించి అడిగితే, పోని యివ్వలేదని చెప్పరాదూ? చివాట్లు వెయ్యటం కాకుండా పెళ్ళాముతో దెబ్బలాడివచ్చావా అని అన్నాడే ఆఫీసరు. మెడనుండి తలకాయకొట్టేసినంత అవమానం! ఎంత అవమానం! వొళ్ళు మండ

పోతుంది, ప్రక్కన నీళ్ళుకూడా లేవే—ఆత్మ హత్యచేసుకోవడానికి.

ఇక అక్కడ నిలువలేక రమణ రూము నుండి బయటపడి తన సీట్లోకి వెళ్ళి కూర్చున్నాడు.

★ ★ ★

సాయంకాలం అయింది. ఆఫీసునుండి యింటికి వెళ్లడానికిలేచాడు, ఆఫీసరు అతడ్ని చూసి అన్నాడు—'అలా ఒకరిమీద నిందలు వేయకోయ్. నీ వెధవవాచీ నా కెందుకోయ్? అంతకంటె మంచిదే కొనుక్కోవచ్చు.

ఏమిటీ ? రమణది వెధవ వాచీయా? మళ్ళా యిక్కడకూడా అదేమాటా ? రెండు వందల రూపాయల విలువగలది! పైగా అతడి మామగారు పెళ్ళిలో బహుమతిగా యిచ్చిందీను !

అయనేమో ఆఫీసరు! ఏమీ అనడానికి వీలుకాకపోయింది. రమణ ఆఫీసునుండి బయటపడి యింటిమార్గం పట్టాడు.

ప్రక్కింటి అమ్మాయి ఉష తన అన్నయ్యా గురించి నిన్న వాచీ అడిగింది. కాని అతడు యివ్వలేదు. కాని తరువాత దయకలిగి ఉష అన్నయ్యా వెంకటేశం వారిలో కనబడినప్పుడు యిచ్చాడేమో? అది నిజం కావచ్చు ఖచ్చితం గానూ. ఈ నిర్ణయానికి తిరుగులేదు.

మార్గంలో అతడికి వెంకటేశం కనిపించాడు. అరే! తనప్రక్కనే వస్తున్నాడే, అదీ సంగతి! ఇతడికే రమణ వాచీనిచ్చాడన్న మాట. ఇచ్చినవాడిని అడగటం మానేసి, యివ్వనివారిని అడిగితే మరి నిందించరూ? వెంకటేశం దగ్గరగా వచ్చాడు.

వాచీ అడగటానికి రమణ నోరెత్తాడు.

వెంకటేశం అన్నాడు — 'ఏమండీ! మేం దొంగల మనుకున్నారా యేమిటి ? నిన్న వాచీ అడిగితే యివ్వలేదు. మా చెల్లెల్ని వాచీ గురించి అడిగారట! ఇవ్వనివాచీ ఎలా వస్తుందని మా చెల్లెల్ని అడిగారు ? దేనికైనా బుద్ధి వుండియేడ్వాలి. 'వినాశకాలే విపరీతబుద్ధిః' అన్నారు. అది పూరికినే పోతుందా ? ఇక మీదటనైనా వొళ్ళు దగ్గరగాపెట్టుకుని మాట్లాడండి. అలాంటి వెధవవాచీని మేం దొంగిలిస్తామనుకున్నారా?'

అలా గడగడా తిట్టేసి వెంకటేశం అక్కడి నుండి వెళ్ళిపోయాడు గబగబా.

అబ్బ! ఎంతగా అతడ్ని తిట్టేశాడు ? దేనికైనా హద్దు అంటూ వుండాలి. ఈమధ్య కాలేజీ కుర్రాళ్ళకి జ్ఞానం అంటూ లేకుండా పోయింది. ఐనా తనవాచీ వెధవవాచీయా? రెండు వందల రూపాయల విలువగల వాచీ! పైగా తన మామగారు పెళ్లిలో బహుమతిగా యిచ్చిందీను! అటువంటి వాచీ వెధవ వాచీయా? ఘోరమైన అవమానం! పరమ ఘోరమైన అవమానం! ఇంటికి వెళ్లగానే వీళ్లందరిమీద పుంజుడేసి చొప్పున ఒక్కొక్కళ్ళమీద గేయాలు వ్రాసేయాలి. 'వినాశ కాలే విపరీతబుద్ధిః' అన్నాడు. అంటే రమణకి వినాశకాలం దాపురించిందనేకదూ అర్థం.

విచారమైన ముఖంతో దారిలో సంపెంగ పూవులుకొని యింటికి వెళ్ళాడు. ద్వారం దగ్గర అతడి శ్రీమతి, రాజేశ్వరి చిరునవ్వుతో ఆహ్వానించింది.

నవ్వు రాకపోయినా రమణ నవ్వేశాడు ఫేలవంగా.

రాజేశ్వరి అంది — 'త్వరగా స్నానంచేసి రండి. మీకో మంచి బహుమతి యిస్తాను.'

'ఏమిటీ?' అన్నాడు చిరాకుగా రమణ.

'మీరు త్వరగా స్నానంచేసిరండి చెప్తాను.'

గత్యంతరంలేక అతడు స్నానంచేసి శుభ్రమైన దుస్తులు వేసుకున్నాడు. అతడి గదిలోనికి రాజేశ్వరి వోవల్టిన్, టిఫిన్ తెచ్చింది. అది ముగించి అడిగాడు.

'ఏమిటా బహుమతి?'

'చెప్పనా?'

'చెప్పు' మరి పూరించకు.'

ఆమె గడియారంతీసి చూపించింది డ్రాయరులోనించి. అతడు ఆశ్చర్యపోయాడు.

'పొద్దున్న నేను వెదికాను. మరి నాకు కనపడలేదేం?' రమణ అడిగాడు.

ఆమె అన్నది — 'మీకు యీమధ్య మతిమరుపు ఎక్కువయింది. నిన్న సాయంకాలం గినికి 'ఆయిలింగ్ చెయ్యమని వాచ్‌షాపులో యిచ్చారట అక్కడినుంచి వాళ్ల పనికుర్రాడు పట్టుకువచ్చి యిచ్చాడు.'

'అనవసరంగా వాళ్లనీ వీళ్లనీ అడిగి అవమానం పొందవలసివచ్చింది.'

శ్రీమతి కిలకిలా నవ్వింది. రమణకూడ నవ్వాడు.

ప్రక్కనున్న సంపెంగ పూవులు కూడ 'తాముకూడ నవ్వుతున్నాయన్నట్లుగా గాలికి ఇటూ అటూ కదిలాయి.

రమణ ఆ పువ్వుల్నితీసి రాజేశ్వరి తలలో తురిమాడు. ఆమె అతడిమీద వాలిపోయింది. అతడు ఆమెను....

ఇప్పుడదంతా ఎందుకు లెండి! పగలంతా ఎంతో అవమానం పొంది, విచారించవలసి వచ్చింది. పాపం యిప్పుడైనా ఆనందంగా ఉండనక్కరలేదా ?

★


# సిప్ఫిలినో

దీని సేవవలన తీరునట్టి వ్యాధులు, మేహ పొడలు, మేహ వ్రణం, మేహ వాయువు, మేహ జ్వరం, నలుపు, తెలుపు, ఎరుపు, మేహములు, గ్రంధి, తీట, గుంటపుండ్లు, నయముకాని వ్రణములు, కంఠమాల, తొడలో కలుగునట్టి అరటి పూవువంటి గడ్డలు, తామర, తిమ్మిర వాయువు, మేహ పగుళ్లు, శుక్ల మూత్రము, మధుమేహము ఇటువంటి సకల వ్యాధులను గ్యారంటీగా గుణపరచును. స్త్రీ పురుషులు వాడవచ్చును. 20 పూటలమందు రూ. 3=50 న.పై.

ధనలక్ష్మి అండ్ కో.,
త. పె. నం. 1376, మద్రాసు-1.